క్లుప్తంగా

ప్లాస్టిక్ రహిత విజయనగరమే లక్ష్యం..



దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

విజయనగరం: ప్లాస్టిక్ రహిత విజయనగరమే లక్ష్యంగా సచివాలయ సిబ్బంది కూడా దుకాణాలపై దాడులు నిర్వహించి, పాలిథిన్ ఉత్పత్తులను సీజ్ చేస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న టిఫిన్ దుకాణాలు, కిరాణా షాపులు, తదితర రిటైల్ దుకాణాలల్లో దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తున్నారా లేదా అనేది సచివాలయ కార్యదర్శులు గమనిస్తున్నారు. ఎవరైనా నిషేధిత పాలిథిన్ వస్తువులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సరుకు సీజ్ చేయడంతో పాటు యజమానులకు అపరాధ రుసుం విధిస్తున్నారు. నగరంలో పాలిథిన్ ఉత్పత్తుల పూర్తి నిషేధమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు.

పన్నులపై ఆరా



పన్నులు తనిఖీ చేస్తున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో భవనాల పన్ను విధింపుపై కమిషనర్ కె. అప్పలరాజు ఆరా తీశారు. ఈ మేరకు మొయిద జంక్షన్ రెండో సచివాలయం పరిధిలో మార్పులు చేసిన భవనాలకు సంబంధించి యజమానులు పన్ను చెల్లించినదీ లేనిదీ శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

డెంకాడ: మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో బాబా 99వ జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఓంకారం, సుప్రభాతం, అష్టోత్తరపూజలు చేపట్టారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. దాతల సహకారంతో వస్త్రదానం, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బాబా చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించినట్లు సమితి కన్వీనర్ సూరినాయుడు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిప్పలవలసలో నిఘా కెమేరాలు



తిప్పలవలసలో మాట్లాడుతున్న ఎస్సై దుర్గాప్రసాద్

పూసపాటిరేగ : తీరప్రాంత గ్రామాలలో నిఘా కెమేరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తిప్పలవలస, పతివాడతో పాటు పలు గ్రామాలలో నిఘా కెమేరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేరాలకు పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు ఈ కెమేరాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో తిప్పలవలస మాజీ సర్పంచ్ వాసుపల్లి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

సారిపల్లిలో పారిశుధ్య పనులు



కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో డయేరియా కేసులు నమోదవుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో గ్రామంలో పారిశుధ్య పనులు చురుగ్గా చేపడుతున్నారు. ఎంపీడీఓ రామకృష్ణరాజు ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు కాలువలో పేరుకుపోయిన పూడికలను శుక్రవారం తొలగించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధుల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మజ్జి రమణ, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సర్వేకు సహకారం కరువు

- కార్పొరేషన్ పరిధిలో నత్తనడకన కుటుంబ సర్వే
- ఇప్పటివరకు 63.09 శాతం పూర్తి

విజయనగరం: సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు కూటమి సర్కారు చేపడుతున్న కుటుంబ సర్వేకు ప్రజల నుంచి సహకారం కరువవుతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి గృహ సముదాయంలోని వివరాలు సేకరించినప్పటికీ తాజాగా ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ చేయాలని నిర్ణయించారు. కుటుంబ వివరాల నమోదుకు సర్వే చేపట్టారు. ఈ ప్రక్రియ విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో నత్తనడకన సాగుతోంది. ఈ నెల 15వ తేదీ నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని గడువు విధించినా.. ఇప్పటివరకు కేవలం 63.09 శాతం మాత్రమే పూర్తయింది. సచివాలయ ఉద్యోగుల్లో చాలా మంది సర్వేపై నిర్లక్ష్యంగా వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. విజయగనరం కార్పొరేషన్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 79,893 గృహ సముదాయాలు ఉండగా... ఇప్పటివరకు 50,407 సముదాయాలకు జియో ట్యాగింగ్ పూర్తయింది. మరో 29,486 సముదాయాలకు జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంది.

కార్యాలయాల్లో కూర్చునే...

ప్రభుత్వాలు మారుతుంటే విధానాలు మారుతుండడం సర్వసహజమైపోయింది. ఇందులో భాగంగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుటుంబ సర్వే పేరిట ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తోంది.

అయితే చాలామంది ఉద్యోగులు కార్యాలయంలో కూర్చుని పాత రికార్డులను ముందేసుకుని సర్వే చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ పరిధిలో మజ్జిపేట ప్రాంతంలో 82.02 శాతం అత్యధికంగా ఈ ప్రక్రియ జరగగా... బొందుల



నగరంలో జియో ట్యాగింగ్ సర్వే చేపడుతున్న సిబ్బంది

50 డివిజన్ల పరిధిలో..

నగరం 50 డివిజన్ల పరిధిలో విస్తరించి ఉంది. ఆయా డివిజన్లలో 61 సచివాలయాలున్నాయి. వాటి పరిధిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులు వారికి కేటాయించిన క్లస్టర్ల వారీగా ప్రతి ఇంటినీ సర్వే చేసి, కుటుంబ సభ్యుల వివరాలన్నీ నమోదు చేసి జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంది. అంతేకాకుండా ఇంటి ఫొటోతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరి నుంచి ధ్రువీకరణ నిమిత్తం బయోమెట్రిక్‌ను అనుసంధానం చేయాలి.

గూడెం, పుత్సల వీధి, సాయినాథ్‌కాలనీ, అద్దెపల్లివారి వీధి ప్రాంతాల్లో 75 శాతానికి పైగా సర్వే పూర్తయింది. నగరంలో కేఎల్‌పురం ప్రాంతంలో అత్యల్పంగా 39.50 శాతం మాత్రమే జియో ట్యాగింగ్ చేశారు. అదేవిధంగా ప్రదీప్‌నగర్, బాబామెట్ట ప్రాంతంల్లో 50 శాతం లోపే జియో ట్యాగింగ్ పూర్తయినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

ప్రచార లోపం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేయడంలో కొంతమంది ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సర్వేతో అర్హులకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లభిస్తాయని చెపుతున్నారు. వాస్తవానికి ముందుగానే వార్డుల్లో ప్రచారం చేపట్టాల్సి ఉన్నా అలాంటి చర్యలు చేపట్టలేదు. ఒక్కో సచివాలయ కార్యదర్శికి ఒక క్లస్టర్ కేటాయించారు. క్లస్టర్‌లో 100 నుంచి 150 ఇళ్లు మాత్రమే సర్వే చేసి జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంది.

త్వరగా పూర్తి చేస్తాం..

కుటుంబ సర్వేపై కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ.. త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. ప్రస్తుతం గడువు పెంచారని, దీంతో సర్వేను పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి అనుమానాలు పెట్టుకోకుండా సచివాలయ కార్యదర్శులకు సహకరించాలి.

అభినందనలు



పూసపాటిరేగ మండల కేంద్రంలోని వెంకటసీతారామా డిగ్రీ కళాశాలకు చెందిన కోండ్రు కృష్ణ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో విజేతగా నిలిచాడు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు కృష్ణా జిల్లాలో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ పడాల పైడిరాజు, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు. – పూసపాటిరేగ

పేదలకు సాయం అందించాలి



పేదలకు ప్రతి ఒక్కరూ తోచిన విధంగా సాయం అందించాలని సాయి సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి ఎం.డి అక్కెన శ్రీరామ్మూర్తి అన్నారు. భగవాన్ సత్యసాయి జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక సాయి ఆస్పత్రిలో 300 మంది పేదలకు చీరలు, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, సత్యసాయి 99వ జయంతిని పురస్కరించుకుని 99 రోజుల పాటు 99 మంది నిరుపేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అక్కెన లక్ష్మి, డాక్టర్ మాధురి, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

సారిపల్లిలో అధికారుల పర్యటన



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ రాణి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో జిల్లా అధికార బృందం శుక్రవారం పర్యటించింది. గ్రామంలో వరుసుగా డయేరియా కేసులు నమోదవుతుండడంతో 'అమ్మో డయేరియా' శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ కె.రాణి స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డయేరియా బారిన పడి కోలుకున్న వారి ఇంటికెళ్లి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడాన్ని చూసి శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. కేసులు అదుపులో ఉన్నప్పటికీ ముందస్తు జాగ్రత్తగా వైద్య శిబిరాన్ని కొనసాగించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కవిత తాగునీటి ట్యాంక్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. నీటి శాంపిల్స్ నాణ్యతపై ఆరా తీశారు. తాగునీరు కలుషితం కాలేదని గుర్తించి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటిలాగే ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వైకుంఠంనాయుడు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, వైద్యాధికారి సాయిరామ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ ప్లాన్‌లను ఏర్పాటు చేయాలి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణ సమయంలో అనుమతి పొందిన భవనాలు తాలూకా ప్లాన్ వివరాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే భవన నిర్మాణం జరుగుతున్న సమయంలో ప్రజారోగ్య దృష్ట్యా ప్రతిఒక్కరూ గ్రీన్ నెట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్లపై నిర్మాణ సామగ్రిని గాని డెబ్రిస్‌ను గాని వేయరాదని తెలిపారు. నిబంధనలను అతిక్రమించినట్లయితే అపరాధ రుసుం వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

దోమల నివారణకు చర్యలు

విజయనగరం: నగరంలో దోమల నివారణకు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. పలు ప్రాంతాలలో ప్రజారోగ్య సిబ్బంది దోమల నియంత్రణకై ఫాగింగ్ యంత్రాలతో పొగ వెదజల్లుతున్నారు. అలాగే కుంటలు, చెరువులలో యాంటీ లార్వా ఆపరేషన్ చేపడుతున్నారు. కాలువల్లో మిలాథియాన్ పిచికారీ చేస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

సక్రమంగా నీటి సరఫరా



సమావేశానికి హాజరైన వాల్వ్, లీక్ ఆపరేటర్లు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగర ప్రజలకు రోజువిడిచి రోజు కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని కమిషనర్ పల్లి నల్లనయ్య వాల్వ్ ఆపరేటర్లు, లీక్ ఆపరేటర్లకు సూచించారు. మధుపాడ వాటర్ పంప్ వర్క్స్ వద్దకు కమిషనర్ పల్లి నల్లనయ్య శుక్రవారం ఉదయం చేరుకుని అక్కడి పరిస్థితులను సమీక్షించారు. నీటి సామర్థ్యం, నీటి పంపిణీ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రధాన పైప్‌లకు ఎక్కడా లీకులు లేకుండా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. అనంతరం విజయనగరం కార్పొరేషన్ కార్యాలయంలో వాల్వ్, లీక్ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలువల్లో ఉన్న పైపులను యుద్ధప్రాతిపదికన మార్చుకునే విధంగా చూడాలన్నారు. అందరి సమన్వయంతో సురక్షితమైన నీరు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి తప్పనిసరిగా వాటర్ ట్యాంకులు శుభ్రపరచాలని సూచించారు. సమావేశంలో డీఈ మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు గౌరవం ఇవ్వాలి

- తహసీల్దార్‌ను కోరిన టీడీపీ నాయకులు

పూసపాటిరేగ: మండల పరిధిలోని టీడీపీ నాయకులకు తగిన గౌరవం ఇవ్వాలని, జనసేన నాయకుల మాటలు విని తమను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ తాడ్డి గోవిందను మాజీ ఎంపీపీ మహంతి చిన్నంనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీజీ శంకరరావుతో పాటు పలువురు టీడీపీ నాయకులు కలిసి సమస్యలు ఏకరవు పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి టీడీపీ నాయకులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎనభై శాతం ఉన్న టీడీపీ నాయకులకు రెవెన్యూ అధికారులు గౌరవం ఇవ్వాల్సిందేనన్నారు. అధికారులు ఎటువంటి పక్షపాత వైఖరి వహించినా బాధ్యులవుతారని స్పష్టం చేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ రెవెన్యూ పనులు నిబంధనల మేరకు పారదర్శకంగా చేపడుతున్నామన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆకిరి ప్రసాదరావు, పతివాడ తమ్మునాయుడు, పసుపులేటి గోపి, విక్రం జగన్నాథం, పిన్నింటి శ్రీనివాసరావు, కొత్తకోట రమణ, సీహెచ్ ఆనంద్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ గోవిందతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

- డీఎంహెచ్‌ఓ కె. రాణి

విజయనగరం ఫోర్ట్: కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా డయేరియా, టైఫాయిడ్, పచ్చ కామెర్లు ప్రబలే అవకాశం ఉందని డీఎంహెచ్‌ఓ కె. రాణి తెలిపారు. ఇటువంటి వ్యాధులు ప్రబలకుండా కాచి చల్లార్చిన పరిశుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. కూరగాయలు, పండ్లు బాగా శుభ్రం చేసుకుని తినాలని సూచించారు. ఆహారం తినడానికి ముందు, మల విసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలన్నారు. నిల్వ ఉన్న ఆహారాన్ని తినరాదని సూచించారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు

విజయనగరం: ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ సూచనలతో నగరంలో ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను చేపడుతున్నామన్నారు. నగర పరిధిలో గల అన్ని పోలింగ్ కేంద్రాలలో ఈ ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఫారం 6,7,8 అందుబాటులో ఉంటాయని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు కూడా అవకాశం ఉందని తెలిపారు. ఓటుహక్కును ఒక నియోజకవర్గం నుంచి వేరే నియోజకవర్గానికి మార్చుకునే వీలుందన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపండి



గజపతినగరం: గజపతినగరం పోలీస్ స్టేషన్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గజపతినగరం/దత్తిరాజేరు: గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. గజపతినగ రం, దత్తిరాజేరు మండలంలోని ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషన్‌లలో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డులతో పాటు స్టేషన్‌ల ఆవరణలో ఉన్న వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. సిబ్బంది సమస్యలను తెలుసుకుని, పరి ష్కారానికి చర్యలు తీసుకుంటా మని చెప్పారు. మాదకద్రవ్యాలు, గంజాయి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై 'సంకల్పం' పేరుతో అవగాహన సదస్సులు నిర్వ హించి, విద్యార్థులు, యువత పక్కదారి పట్టకుండా చూడాలని చెప్పారు. పోలీస్ సిబ్బంది తాము దత్తత తీసుకున్న గ్రామాల్లో తరచూ పర్యటించి ప్రజలతో మమేకం కావాలని, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగుండా చూడాలని, శాంతి భద్రలకు విఘాతం కలిగితే మహిళా పోలీస్‌లు ఎస్‌ఐలకు సమాచారం అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ, గజపతినగరం, ఎస్.భూర్జవలస, పెదమానాపురం ఎస్‌ఐలు లక్ష్మణరావు, రాజేష్, జయంతి ఉన్నారు.

నగర అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగర అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన చేసినట్లు కమిషనర్ నల్లనయ్య చెప్పారు. 2025 – 26 వార్షిక బడ్జెట్ సన్నాహక సమావేశం శుక్రవారం సాయంత్రం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 – 25 సవరణ బడ్జెట్, 2025–26 బడ్జెట్ తయారీకి సంబంధించిన వివరాలను విభాగాధిపతులు, సిబ్బంది వెల్లడించారు. జూనియర్ ఆడిట్ ఆఫీసర్ కిరణ్ సన్నాహక బడ్జెట్ వివరాలను సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ఆడిట్ అధికారి లూథర్ పాల్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ఎంఈటీ రాయల్ బాబు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, గణాంక అధికారి రోజా వెంకటలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి సీతారామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.